
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం ၊ 20 ၊ సెప్టెంబర్ ၊ 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 22.767 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 485 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) - రూ.61,250
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -రూ.5,520
3 శాతం జీఎస్టీతో.. - రూ.5,685
సవర (8 గ్రా) - రూ.45,480

గరిష్టం/కనిష్టం
37.4 /28.5

వాతావరణం

మంగళవారం గాలిలో తేమ 57 శాతం ఉంది. బుధవారం ఎండ తీవ్రత, ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

కామాక్షితాయి సేవలో జిల్లా జడ్జి



అమ్మవారిని దర్శించుకుంటున్న జడ్జి సుమ

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని జిల్లా ఎనిమిదో అదనపు జడ్జి సిరిపిరెడ్డి సుమ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయంలోని గణపతిస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలతో ఆలయ అర్చకులు ఆమెను సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ గిరికృష్ణ, ఎస్సై వీరప్రతాప్ పాల్గొన్నారు.

నేడు ఇందుకూరుపేటలో జగనన్నకు చెబుదాం

• అర్జీలు స్వీకరించనున్న కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): ఇందుకూరుపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమాన్ని కలెక్టర్ ఎం.హరినారాయణన్ నిర్వహిస్తారని జెడ్పీ సీఈఓ చిరంజీవి మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై కలెక్టర్‌కు అర్జీలు అందజేయవచ్చని తెలిపారు.

శ్రీరాజరాజేశ్వరి ఆలయ హుండీ కానుకల లెక్కింపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం హుండీల్లోని కానుకలను లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్ తెలిపిన వివరాల మేరకు భక్తులు ఈ ఏడాది జూన్ 21 నుంచి సెప్టెంబర్ 19వ తేదీ వరకు రూ.27,09,409 అమ్మవారికి, స్వామివారికి కానుకల రూపంలో హుండీల్లో సమర్పించారు. అలాగే అన్నదానం హుండీ ద్వారా రూ.1,25,825, సింగపూర్, సౌదీ కరెన్సీ సమర్పించారని తెలిపారు. హుండీ లెక్కింపును కొండబిట్రగుంట శ్రీప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయ ఈఓ రాధాకృష్ణ, దేవదాయ, ధర్మాదాయశాఖ నెల్లూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుధీర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, విశ్రాంత ఎస్‌బీఐ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.వినయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్నోవ్ సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, వీల్స్ ఇండియా లిమిటెడ్, వరుణ్ మోటార్స్ లిమిటెడ్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు, ఐటీఐ, డిప్లమో, బీటెక్ చదివిన వారు అర్హులని, ఆసక్తి గల వారు స్థానిక ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి రూ.17 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు.

ఉత్సాహంగా ఎడ్ల బండలాగుడు పోటీలు



ప్రథమ బహుమతి గెలుచుకున్న ఎడ్లు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని మర్రిపాడు మండలం రామానాయుడుపల్లిలో మంగళవారం ఎడ్ల బండలాగుడు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాలకు చెందిన 9 జతల ఎడ్లు ఈ పందేల్లో పాల్గొనగా, తొలి మూడు బహుమతులు నెల్లూరు జిల్లాకు చెందిన ఎడ్లు దక్కించుకోవడం విశేషం. ప్రథమ బహుమతి సాధించిన ఎడ్ల యజమాని, వింజమూరు బీసీ కాలనీకి చెందిన జి.బాలాజీ రూ.15 వేల నగదు బహుమతి అందుకున్నారు. అలాగే కొడవలూరు మండలం రామన్నపాళేనికి చెందిన ఎడ్ల యజమాని హేమంత్‌రెడ్డి ద్వితీయ బహుమతిగా రూ.12 వేలు అందుకున్నారు. దామరమడుగుకు చెందిన ఎడ్ల యజమాని దువ్వూరు శైలజారెడ్డి తృతీయ బహుమతిగా రూ.9 వేల నగదు బహుమతి అందుకున్నారు. గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, పలువురు దాతల సహకారంతో ఈ ఎడ్ల పందేలు నిర్వహించారు.

రైతుకు వెన్నుదన్ను

రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ రైతులను ప్రోత్సహిస్తోంది. కర్షకులకు బ్యాంకుల ద్వారా విరివిగా రుణాలు అందజేస్తూ వ్యవసాయాన్ని పండగ చేస్తోంది. రైతులు పెట్టుబడి కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదని భావించిన ప్రభుత్వం లక్ష్యానికి మించి పంట రుణాలు, టర్మ్ లోన్స్, అగ్రి ఇన్‌ఫ్రా తదితర రుణాలను మంజూరు చేస్తూ సహకారం అందిస్తోంది.

రుణాలు అందిస్తూ అండగా నిలుస్తున్న ప్రభుత్వం

- ఖరీఫ్‌లో లక్ష్యానికి మించి అందజేత
- లక్ష్యం రూ.6,166 కోట్లు కాగా రూ.7,928 కోట్లు అందించిన సర్కారు
- 2022–23లో మంజూరు చేసిన మొత్తం రుణాలు రూ.22,138 కోట్లు
- రికార్డు స్థాయిలో రుణాలు అందించిన ప్రభుత్వానికి అన్నదాతల కృతజ్ఞతలు



వరి పొలంలో యూరియా చల్లుతున్న రైతులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అందరికీ అన్నం పెట్టే అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. పంటల సాగుకు సకాలంలో రుణాలు అందిస్తోంది. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక రుణాలు అందించడంతోపాటు వ్యవసాయ, ఇతర అనుబంధ రంగాలకు అండగా ఉంటోంది. గత ఏడేళ్లలో వ్యవసాయానికి అత్యధిక రుణ ప్రణాళిక ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం నిర్ణయించింది. ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సాగు చేసే రైతాంగానికి పెట్టుబడి ఇబ్బందులు తొలగించేలా ఆర్థిక సహకారం అందిస్తోంది. బ్యాంకుల ద్వారా విరివిగా రుణాల మంజూరు ప్రణాళికలు పూర్తిస్థాయిలో అమలు చేస్తోంది. ఈ ఏడాది జిల్లా రైతులకు బ్యాంకుల ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.15,490 కోట్ల పంట, అనుబంధ రుణాలు అందించాలనేది లక్ష్యంగా కాగా ఇప్పటి వరకు (సెప్టెంబర్ నాటికి) రూ.22,138 కోట్ల రుణాలు మంజూరు చేసింది. అంటే 142.91 శాతం మేర రుణాలు అందజేసింది.

విరివిగా రుణాలు

2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.15,490 కోట్లు రుణాల రూపంలో అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ ఏడాదిలో జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సాగు చేసే 2,26,378 మంది రైతులకు రూ.6,166 కోట్లు పంట రుణాలుగా అందించాలని నిర్ణయించగా.. లక్ష్యానికి మించి రూ.7,928 కోట్లు అందించి అండగా నిలిచింది.

రెండేళ్లుగా రికార్డుస్థాయి రుణాలు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పంటలు పండించి అందరి ఆకలి తీర్చే అన్నదాతలు పెట్టుబడికి ఎలాంటి ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో వారికి అండగా నిలుస్తున్నారు. రైతులకు అందిస్తున్న వ్యవసాయ రుణాలే ఇందుకు నిదర్శనం. 2014–15, 2015–16 ఆర్థిక సంవత్సరాలతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో వ్యవసాయ అనుబంధ రుణాలు అందిస్తూ రైతులకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తుండడం విశేషం.

2014 నుంచి పంట రుణాలు

ఏడాది	లక్ష్యం (రూ.కోట్లలో)	ఇచ్చిన రుణాలు (రూ.కోట్లలో)	శాతం
2014-15	2,918.56	1,920.80	65.81
2015-16	7,799.04	8,376.12	107.4
2016-17	9,517.20	7,360.57	77
2017-18	11,932.23	9,202.23	77.12
2018-19	11,252.80	11,453.50	101.78
2019-20	13,110.95	9,880.40	75.35
2020-21	13,500	13,091.73	96.97
2021-22	16,540.95	8,551.2	56
2022-23	15490	22,138	142.98

జిల్లాలో వివిధ రంగాలకు సంబంధించి 2022- 23 సంవత్సరానికి రుణాల వివరాలు

రుణాల రకం	లక్ష్యం (రూ.కోట్లలో)	ఇచ్చిన రుణాలు (రూ.కోట్లలో)	రుణాల శాతం
పంట రుణాలు	6,166	7,928	128.57
టర్మ్ లోన్స్	1,777	3,469	195.21
అగ్రి ఇన్‌ఫ్రా	150	55	36.66
ఇతర రుణాలు	252	674	267.46
ఎంఎస్‌ఎంఈ	1,940	3,824	197.11
ఇతర ప్రయారిటీ	880	413	46.93
ప్రాథమిక ప్రయారిటీ	11,165	16,563	148.34
నాన్ ప్రయారిటీ	4,325	5,574	128.87

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది

జిల్లాలో అన్ని బ్యాంకుల నుంచి అన్నివర్గాల వారు రుణాలు తీసుకుంటున్నారు. బ్యాంకు అధికారులు కూడా ఎక్కడా ఇబ్బందులు లేకుండా రుణాలు మంజూరు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి కూడా ప్రోత్సాహం బాగుంది. వ్యవసాయ రుణాలు ఎక్కువగా ఇస్తున్నాం.

– టి.శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, ఎల్‌డీఎం

సకాలంలో రుణాలు ఇస్తున్నారు



గతంలో బ్యాంకు రుణాల కోసం అధికారుల చుట్టూ, బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. సచివాలయాల ఏర్పాటు తరువాత బ్యాంకు రుణాలు తీసుకొనేందుకు అవసరమైన పత్రాలు కూడా గంటల వ్యవధిలోనే ఇస్తున్నారు. సాంకేతికంగా అన్ని పత్రాలు పరిశీలించి ఒక్క రోజులోనే బ్యాంకులు రైతులకు రుణాలు ఇస్తున్నాయి.

– షేక్ హమీర్ ఉన్నీసా, నందవరం, మర్రిపాడు మండలం

రుణాల మంజూరులో వేగం పెరిగింది



రైతులకు పంట రుణాల మంజూరులో బ్యాంకర్లు వేగం పెంచారు. గతంలో రైతులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ, రెవెన్యూ అధికారుల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సివచ్చేది. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. తీసుకున్న రుణాలను నిర్దిష్ట కాలపరిమితిలోపు తిరిగి చెల్లించిన రైతులకు మరలా పలు రకాల రుణాలను బ్యాంకు సిబ్బంది పిలిచి మరీ ఇస్తున్నారు.

– చంద్రా తిరుపతి, రైతు, అప్పారావుపాళెం, ఆత్మకూరు మండలం

అన్నదాతల అభ్యున్నతే ధ్యేయం

- అసెంబ్లీలో కనీస మద్దతు ధర చట్టాన్ని ప్రవేశపెడతాం
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



జట్లకొండూరులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, మొట్టమొదటిసారిగా కనీస మద్దతు ధర చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని జట్లకొండూరు గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్లను సోమవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ రైతులకు అండగా నిలవాలనే లక్ష్యంతో చరిత్రలో తొలిసారిగా అసెంబ్లీలో కనీస మద్దతు ధర చట్టాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా ఈ చట్టాన్ని ప్రవేశపెట్టనుండడం సంతోషంగా ఉందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించడం, అమలయ్యేలా చూడడం, అమలు చేయకపోతే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయాలను ఈ చట్టంలో పొందుపరిచినట్లు తెలిపారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామాల్లో అభివృద్ధిలో భాగంగా గత నాలుగేళ్లలో జట్లకొండూరులో సుమారు రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం మనుబోలు మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల పని తీరుపై మంత్రి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణంలో జాప్యంపై ఆగ్రహం

జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం మందకొడిగా సాగుతున్నా ఎందుకు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడం లేదని హౌసింగ్ ఏఈ, ఎస్సైలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఐ సంగమేశ్వరరావును ఆదేశించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ వజ్రమ్మ, ఉపాధ్యక్షులు వెంకటరమణారెడ్డి, చందన, ఉప సర్పంచ్ తులసీరాం, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు చంద్రశేఖర్, కార్తీక్‌రెడ్డి, రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెందోటి భాస్కర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, కసిరెడ్డి ధనుంజయరెడ్డి, శానంపూడి సురేంద్రరెడ్డి, గుంజి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్‌పై కనీస స్పందన కరువు

దేశ్‌కీ నేత అని చెప్పుకునే చంద్రబాబును అవినీతి కేసుల్లో అరెస్ట్ చేస్తే ప్రజల నుంచి కనీస స్పందన కూడా లేదని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మనుబోలులోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ ఆ పార్టీ నేతలు మనుబోలు, వెంకటాచలంలో దీక్షలు నిర్వహిస్తే కనీస స్పందన లేదన్నారు. సోమిరెడ్డి వ్యవసాయశాఖ మంత్రిగా ఉండగా మిల్లర్లు, వ్యాపారులతో మిలాఖత్ అవడం వల్లే వాళ్లు మద్దతు ధర ఇవ్వకుండా రైతుల పొట్ట కొట్టగలిగారన్నారు. గత సీజన్‌లో ధాన్యానికి అధిక ధర లభిస్తే ఉక్రెయిన్‌లో యుద్ధం కారణంగా మన బియ్యం ఎగుమతులు పెరిగి ధరలు పెరిగాయే తప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి కాకాణి ఘనత ఏమీ కాదని సోమిరెడ్డి విమర్శించారన్నారు. ఇప్పుడు యుద్ధం లేకున్నా ధాన్యం ధరలు అధికంగా ఉన్నాయంటే తాము సోమిరెడ్డి లాగా మిల్లర్లతో మిలాఖత్ కాకపోవడమే కారణమన్నారు. పదేపదే బండేపల్లి కాలువ గురించి ప్రస్తావించే సోమిరెడ్డి దానికి ఆమోదపత్రం తేవడం తప్ప ఒక్క రూపాయి నిధులు మంజూరు చేశాడా, కనీసం భూసేకరణకు డబ్బులిచ్చాడా చెప్పాలంటూ చాలెంజ్ విసిరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుండాల ఆదినారాయణ, మహేంద్రవర్మ, కేవీఆర్ గౌడ్, ఏలూరు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలసీలను పునరుద్ధరించుకోండి

• పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్.రామకృష్ణ

నెల్లూరు(మినీబైపాస్): డైరెక్టరేట్ ఆఫ్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ న్యూఢిల్లీ వారు తపాలా శాఖలోని పీఎల్‌ఐ/ఆర్‌పీఎల్‌ఐ రద్దయిన పాలసీలు 25 శాతం నుంచి 30 శాతం వరకు కట్టనవసరం లేకుండా అవకాశం కల్పిస్తున్నట్లు తపాలా శాఖ సూపరింటెండెంట్ ఎస్.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దగ్గరలోని తపాలా శాఖను లేదా 91484 09330/ 96323338415(ఎం.నాగరాజు, డెవలప్‌మెంట్ ఆఫీసర్) ఫోన్‌నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

ఆత్మహత్య కేసులో ముగ్గురికి ఐదేళ్ల జైలు

నెల్లూరు(లీగల్): వ్యక్తి ఆత్మహత్య కేసులో అత్త, మామ, భార్యకి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బి.లక్ష్మీనారాయణ మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలు.. కరేటి వేణుగోపాల్ ఎంబీబీఎస్ విద్యార్థినిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అతని భార్య, అత్త, మామ అవమానాలకు గురిచేయడంతో భరించలేక పురుగుమందు తాగి రైలు కట్ట వద్ద ఆత్మహత్య చేసుకున్నట్లు నమోదైన కేసులో నిందితులైన మామ నావూరు వెంకటరమణయ్య, అత్త నావూరు మంజులమ్మ, భార్య నావూరు లక్ష్మీమాధురిపై ఆరోపణలు సాక్ష్యాధారాలతో రుజువైనందున పై మేరకు శిక్ష విధించారు. కరేటి వేణుగోపాల్ నెల్లూరు మాగుంట లేఅవుట్ ప్రాంతంలో సివిల్ ఇంజినీర్‌గా పనిచేసేవాడు. నావూరి లక్ష్మీమాధురి స్థానిక ఏసీ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. దువ్వూరు గ్రామానికి చెందిన వీరిరువురూ మనసులు కలిసి ప్రేమలో పడ్డారు. ఈ నేపథ్యంలో వీరు నెల్లూరు రూరల్ మండలం కొత్తూరులోని చర్చిలో 2019 జూన్ 8న పెద్దల అనుమతి లేకుండా వివాహం చేసుకున్నారు. వీరి వివాహ విషయాన్ని తెలుసుకున్న లక్ష్మీమాధురి తల్లిదండ్రులు వెంకటరమణయ్య, మంజులమ్మ తమ కుమార్తెను దువ్వూరు గ్రామానికి తీసుకెళ్లి తరువాత బుచ్చిరెడ్డిపాళేనికి కాపురాన్ని మార్చారు. మెడికల్ కాలేజ్ హాస్టల్‌లో ఉన్న లక్ష్మీమాధురిని ఇంటికి తీసుకెళ్లారు. ఈ ఘటనలతో మనస్తాపానికి గురైన కరేటి వేణుగోపాల్ 2019 అక్టోబర్ 20వ తేదీన బుచ్చిరెడ్డిపాళెంలో ఉన్న అత్త, మామ ఇంటికి వెళ్లి తన భార్య లక్ష్మీమాధురిని తన ఇంటికి పంపమని అడిగాడు. దీంతో ఆగ్రహానికి గురైన వారు 'మా అమ్మాయి నీతో రాదని' గట్టిగా చెప్పారు. ఈ లోపు అక్కడికి వచ్చిన లక్ష్మీమాధురి మెడలో ఉన్న తాళిబొట్టును తీసి వేణుగోపాల్ మొహాన కొట్టింది. దీంతో వేణుగోపాల్ తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. అనంతరం 2019 అక్టోబర్ 24వ తేదీన మెడికల్ కాలేజీలో లక్ష్మీమాధురిని కలిశాడు. ఆ సమయంలో లక్ష్మీమాధురి ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'నీకు నాకు సంబంధం లేదు.. ఇక్కడికి రావద్దు' అని గట్టిగా చెప్పింది. దీంతో వేణుగోపాల్ మాగుంట లేఅవుట్ సమీపంలోని రైలు కట్ట వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కొన ఊపిరితో ఉన్న వేణుగోపాల్‌ను తొలుత ఓ ఆస్పత్రికి తరలించగా జరిగిన ఘటనపై వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని విజయ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ వేణుగోపాల్ చికిత్సపొందుతూ 2019 నవంబర్ 7న మృతిచెందాడు. జరిగిన ఘటనలపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు వేణుగోపాల్ ఆత్మహత్యకు కారకులైన వెంకటరమణయ్య, మంజులమ్మ, లక్ష్మీమాధురిపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం వీరిపై కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం న్యాయమూర్తి పై మేరకు తీర్పు చెప్పారు. కేసును దర్గామిట్ట పోలీసులు దర్యాప్తు చేయగా ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ నీరజారెడ్డి కేసు వాదించారు.

'సమగ్ర'లో పర్యవేక్షణ కరువు

వలస కూలీల పిల్లల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిన సీజనల్ హాస్టళ్ల నిర్వహణను పట్టించుకునేవారు కరువయ్యారు. ప్రతి నెలా హాస్టళ్లను సందర్శించాల్సిన సంబంధిత అధికారులు అవేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. తక్కువ మంది పిల్లలు ఉన్నా రిజిస్టర్‌లో ఎక్కువ మంది ఉన్నట్లు చూపి బిల్లులు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీనిపై సరైన విచారణ చేపడితే అవకతవకలు బయటపడే అవకాశం ఉంది.

- ఇష్టారాజ్యంగా సీజనల్ హాస్టళ్లు
- పిల్లలు తక్కువ, హాజరు ఎక్కువ
- ప్రతి నెలా తనిఖీ చేయని హెచ్‌ఎం, ఎంఈఓ, స్పెషల్ ఆఫీసర్లు
- సరైన విధానంలో లేని బిల్లులు
- ప్రభుత్వ సొమ్ము భారీగా దుర్వినియోగం

జిల్లాలో..

సీజనల్ హాస్టళ్లు	ఒక్కో హాస్టల్‌కు అనుమతించిన పిల్లలు
23	50 మంది

నెల్లూరు(టౌన్): ప్రత్యామ్నాయ(సీజనల్) హాస్టళ్ల నిర్వహణ పక్కదారి పడుతోంది. హాస్టళ్లను పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పారదర్శకంగా వలస కార్మికుల పిల్లలకు అందాల్సిన ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం అవుతోంది. ఎవరూ విద్యకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వలస కూలీల పిల్లల కోసం సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా ప్రతి మండలంలో వలస కార్మికుల పిల్లలను ఎంఈఓ ఆధ్వర్యంలో గుర్తించి ప్రతి 50 మంది పిల్లలకు ఒక హాస్టల్‌ను నిర్వహిస్తుంది. పిల్లల కోసం ప్రతి నెలా ఒక్కో హాస్టల్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.77 వేలకు పైగా ఖర్చు చేస్తోంది. అధికారులు ప్రతి నెలా హాస్టళ్లను తనిఖీ చేయాల్సి ఉన్నా అవేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో హాస్టళ్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. తక్కువ మంది పిల్లలు ఉన్నా రిజిస్టర్‌లో ఎక్కువ మంది పిల్లలు ఉన్నట్లు చూపించి ప్రభుత్వ సొమ్మును యథేచ్ఛగా దోచేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులకు కూడా ఎంతోకొంత ముట్టజెబుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం సీజనల్ హాస్టళ్ల బిల్లులు మరో రెండు రోజుల్లో సమగ్రశిక్ష ఎస్‌పీడీ వద్దకు చేరనున్నాయి. బిల్లుల్లో ఉన్న అవకతవకలను పూర్తిస్థాయిలో విచారిస్తే నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

అధికారుల నిర్లక్ష్యం

ప్రతి ఏటా నవంబర్ నుంచి ఏప్రిల్ వరకు సీజనల్ హాస్టళ్లను నిర్వహించాల్సి ఉంది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా 2022–23 విద్యా సంవత్సరంలో ఈ ఏడాది జనవరి నెలలో సీజనల్ హాస్టళ్లను ప్రారంభించారు. వీటిని ఎన్జీఓలు నిర్వహించేందుకు అవకాశం కల్పించారు. నోటిఫికేషన్ ఇచ్చి అన్ని అర్హతలను పరిశీలించిన తరువాతే వీటి నిర్వహణ బాధ్యతలను వారికి అప్పగించాల్సి ఉంటుంది.

నిర్వహణ ఇలా..

సీజనల్ హాస్టళ్లను నిర్వహించాలంటే ఎన్జీఓ సంస్థకు 3 ఏళ్ల అనుభవం ఉండాలి. ఆ మూడేళ్ల ఆడిట్ రిపోర్ట్ దర్పణ్‌లో రిజిస్టర్ చేసుకుని ఉండాలి. సీజనల్ హాస్టల్‌లో కేర్‌టేకర్, వలంటీర్ ఉండాలి. వలంటీర్, కేర్‌టేకర్ టీటీసీ లేదా బీఈడీ చేసిన వ్యక్తిని నియమించాల్సి ఉంది. హాస్టల్స్ నిర్వహణకు సంబంధించి ఒక్కో పిల్లవాడికి నెలకు రూ.1,000, కేర్‌టేకర్‌కు రూ.7,500, వలంటీర్‌కు రూ.7,500, వంటమనిషికి రూ.4,500, వంటమనిషి సహాయకుడికి రూ.4,500, కాస్మోటిక్స్‌కు రూ.3,300 కలిపి మొత్తం నెలకు రూ.77,300 రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తుంది. ఈ హాస్టళ్లలో ఆశ్రయం పొందే పిల్లలకు ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్, రాత్రికి భోజనం అందించాల్సి ఉంటుంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో స్టడీ అవర్స్ నిర్వహించాలి. ప్రతి నెలా సీజనల్ హాస్టల్‌ను సంబంధిత హెడ్‌మాస్టర్, ఎంఈఓ, ఏఎల్‌ఎస్, స్పెషల్ ఆఫీసర్లు, సీఆర్పీలు, ఇతర సెక్టోరియల్ అధికారులు తనిఖీ చేయాల్సి ఉంది. గత కలెక్టర్ చక్రధర్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రతి సీజనల్ హాస్టల్‌కు ఒక మండల ప్రత్యేకాధికారిని నియమించారు. ప్రతి నెలా ప్రత్యేకాధికారి ఆ మండల సీజనల్ హాస్టల్‌ను తనిఖీ చేసి రిపోర్ట్ రాయాల్సి ఉంటుంది. అలాగే ఏపీసీ హెచ్‌ఎం, ఎంఈఓ, ఏఎల్‌ఎస్, సీఆర్పీలు, ఇతర సెక్టోరియల్ అధికారులు తనిఖీ చేసిన రోజు విద్యార్థులు, సిబ్బంది హాజరును పరిశీలించి సందర్శకుల బుక్‌లో విజిట్ రిపోర్ట్ రాయాల్సి ఉంది.

ప్రాపర్‌గా ఉన్న బిల్లులను మాత్రమే చేస్తాం

సీజనల్ హాస్టళ్లకు సంబంధించిన బిల్లులను ప్రాపర్‌గా ఉన్న వాటినే మాత్రమే చేస్తాం. ప్రతి నెలా స్పెషల్ ఆఫీసర్లు విజిట్ చేయాల్సి ఉంది. బిల్లులను పూర్తిస్థాయిలో పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటాం. మేలో బిల్లులు పెట్టినట్లు తెలిసింది.

– ఉషారాణి, ఏపీసీ, సమగ్రశిక్ష

రెండు రోజుల్లో ఎస్‌పీడీకి బిల్లుల ఫైల్

ప్రస్తుతం సీజనల్ హాస్టల్స్ బిల్లుల ఫైల్ ఆ శాఖ ఉన్నతాధికారి వద్దకు రానున్నట్లు తెలిసింది. అయితే ఆ సెక్షన్‌కు సంబంధించిన ఏఎల్‌ఎస్‌ను తిరిగి మాతృశాఖకు పంపించడంతో ఆ సెక్షన్‌లోని కింది స్థాయి అధికారులు బిల్లుల వ్యవహారాన్ని చూస్తున్నారు. బిల్లులు సరైన విధానంలో చేయలేదని, ఈ బిల్లులు పెడితే తమ ఉద్యోగానికి ఎక్కడ ముప్పు వస్తుందోనని భయపడుతున్న పరిస్థితి ఉంది. సమగ్రశిక్ష ఉన్నతాధికారి సంతకం అయిన వెంటనే కలెక్టర్‌కు ఫైల్‌ను పంపనున్నారు. ఈ బిల్లులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి విచారణ చేసినట్లయితే లొసుగులు బయటపడే అవకాశం ఉందని ఆ శాఖలో కొంతమంది చెబుతున్నారు.

ఏం జరుగుతుందంటే..

మెజార్టీ సీజనల్ హాస్టళ్లలో కేర్‌టేకర్, వలంటీర్లు క్వాలిఫైడ్ కాని వారు ఉన్నట్లు తెలిసింది. కొన్ని హాస్టళ్లలో 10 మంది పిల్లలు ఉన్నా పూర్తిస్థాయిలో 50 మంది పిల్లలు ఉన్నట్లు హాస్టల్స్ నిర్వాహకులు బిల్లులు పెట్టినట్లు తెలిసింది. జిల్లాలో ఒకటి రెండు తప్ప ఏ సీజనల్ హాస్టల్‌ను అధికారులు తనిఖీ చేసిన సందర్భం లేదు. నెలలో అన్ని సెంటర్లను సందర్శించాల్సిన ఏఎల్‌ఎస్ కొన్ని సెంటర్లనే తనిఖీ చేసినట్లు తెలిసింది. అదేమని అడిగితే వాహనం ప్రొవైడ్ చేయకపోవడంతోనే అన్ని సెంటర్లను తనిఖీ చేయలేకపోతున్నట్లు చెబుతున్నారు. ప్రత్యేకాధికారులు ఒకరిద్దరు తప్ప మిగిలిన వారు విజిట్ చేసిన సందర్భం లేదు. అదేవిధంగా ఎక్కువ హాస్టళ్లలో హెచ్‌ఎం, ఏపీసీ, సీఆర్పీలు విజిట్ చేసి కనీసం రిపోర్ట్ గానీ లేదా రిజిస్టర్‌లో సంతకం గానీ చేయలేదు. బిల్లులను సంబంధిత సెక్షన్ అధికారులకు అందజేసినప్పుడు విజిట్ రిపోర్ట్, సరిగా సంతకాలు లేవని తిరస్కరించినట్లు తెలిసింది. ప్రతి నెలా బిల్లులు పెట్టాలన్న నిబంధన ఉన్నా హాస్టల్స్ నిర్వాహకులు కాలపరిమితి ముగిసిన తరువాత నాలుగు నెలల బిల్లులు ఒకేసారి పెట్టినట్లు తెలిసింది.

మా బొజ్జ గణపయ్య..

వినాయక చవితి పండగను జిల్లా వ్యాప్తంగా ప్రజలు సోమవారం ఘనంగా చేసుకున్నారు. నెల్లూరు నగరంలోని ప్రధాన వీధుల్లో వివిధ ఆకృతుల్లో గణపయ్య భారీ విగ్రహాలను కొలువుదీర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణలు, సెట్టింగ్‌లు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


ట్రంకురోడ్డు ఎడ్లవారి వీధి వద్ద 12 అడుగుల విగ్రహం


సీఎంఆర్ వద్ద గరిక గణపతి


బాలాజీ నగర్ రైస్‌మిల్లు సెంటర్‌లో ఏర్పాటు చేసిన సెట్టింగ్


రేబాలవీధిలో లక్ష గవ్వలతో ఏర్పాటు చేసిన విగ్రహం

క్లుప్తంగా

అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య

- శరీరంపై నూనె పోసుకుని నిప్పంటించుకున్న వృద్ధురాలు

వెంకటాచలం: అనారోగ్య సమస్యలతో వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కసుమూరులో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన షేక్ ఫాతిమా (75) కొన్ని సంవత్సరాలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఆమె తన కుమార్తె వద్ద ఉంటుంది. సోమవారం కుమార్తె పని నిమిత్తం తిరుపతికి వెళ్లగా.. ఫాతిమా ఇంట్లో ఉన్న దీపం నూనెను శరీరంపై పోసుకుని నిప్పంటించుకుంది. పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. అప్పటికే వృద్ధురాలు మృతిచెందింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్‌బైక్‌ను ఢీకొన్న కారు

- ఒకరికి తీవ్ర గాయాలు


గాయపడిన నాగేంద్ర

వరికుంటపాడు: మండలంలోని తోటలచెరువుపల్లె గ్రామ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం మోటార్‌బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఉదయగిరి మండలం వెంగళరావునగర్ గ్రామానికి చెందిన నాగేంద్ర తన బైక్‌పై పెద్దిరెడ్డిపల్లెకు వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో గండిపాళెం నుంచి పెద్దిరెడ్డిపల్లి వైపు వేగంగా వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో నాగేంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని ఉదయగిరి వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న వరికుంటపాడు ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జవహర్ నవోదయలో ఖాళీలు

- విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం


ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం కృష్ణాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 – 25 విద్యా సంవత్సరానికి సంబంధించి బుధవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అక్టోబరు 31వ తేదీని చివరి గడువుగా పేర్కొన్నారు. 2024 సంవత్సరం ఫిబ్రవరి 10వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు సయ్యద్ ఇసాక్ 89850 07588, చెన్నయ్య 81068 98817, ఎం.నరసింహులు 94935 14644ను ఆయా ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కుటుంబాలకు అండగా..

వైఎస్సార్ బీమా అనేక కుటుంబాలకు అండగా నిలుస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టి పక్కాగా అమలు చేస్తోంది. ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే బాధిత కుటుంబాలకు ఆర్థికంగా భరోసా కల్పిస్తోంది. రోజుల వ్యవధిలోనే బ్యాంక్ అకౌంట్లలో నగదును ప్రభుత్వం జమ చేస్తోంది.

- పదిరోజుల్లోనే వైఎస్సార్ బీమా నగదు
- బాధితుల బ్యాంక్ అకౌంట్లలో జమ
- ప్రీమియం చెల్లించే బాధ్యత ప్రభుత్వానిదే..
- కార్మికులందరికీ భరోసా

నెల్లూరు(పొగతోట): నిరుపేద కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని అమలు చేస్తోంది. వ్యవసాయ కూలీలు, హమాలీలు, డ్రైవర్లు, కులవృత్తులు చేసుకునే వారు, భవన నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు, చిన్న, సన్నకారు రైతులు, కళాకారులకు ఈ పథకం వర్తిస్తుంది. కుటుంబ యాజమాని అకాల మరణం చెందితే లేదా అంగవైకల్యానికి గురైతే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంది. ఇంట్లోని వారికి ఆర్థిక చేయూతను అందించి మనోధైర్యం కల్పించాలనే సంకల్పంతో బీమా పథకాన్ని తెచ్చింది. దీనికి సంబంధించిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తోంది. సహజంగా మరణిస్తే రూ.లక్ష, ప్రమాదం జరిగి చనిపోయినా లేదా పూర్తి అంగవైకల్యానికి గురైనా రూ.5 లక్షల బీమా వర్తిస్తుంది.



త్వరితగతిన..

అనంతసాగరం మండలం పడమటి కంభంపాడు గ్రామానికి చెందిన డి.మల్లికార్జున ఈనెల ఒకటో తేదీన ప్రమాదవశాత్తు మృతి చెందాడు. 4వ తేదీన వివరాలు అప్‌లోడ్ చేశారు. 14వ తేదీన నామినీ బ్యాంక్ అకౌంట్‌కు నగదు జమ చేశారు. రోజుల వ్యవధిలో 17 మందికి సంబంధించి రూ.5 లక్షల చొప్పున కుటుంబసభ్యుల బ్యాంక్ అకౌంట్లలో జమ చేశారు.

జిల్లాలో..
ఎంతమంది : 1,378
నగదు : రూ.18.90 కోట్లు

వివరాలు సేకరించి..

జిల్లా వ్యాప్తంగా 4.4 లక్షల మంది బియ్యం కార్డుదారులున్నారు. గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లు క్షేత్రస్థాయిలో బీమా నమోదు ప్రక్రియను నిర్వహించారు. వలంటీర్లు క్షేత్రస్థాయిలో బియ్యం కార్డులు కలిగిన కుటుంబంలో యాజమాని వివరాలు సేకరించి నమోదు చేశారు. బ్యాంక్ ఖాతా, ఫోన్ నంబర్, నామినీ తదితర వాటిని ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. జిల్లా వ్యాప్తంగా 1,378 మంది బాధిత కుటుంబాలకు రూ.18.98 కోట్లు బీమా నగదు ప్రభుత్వం మంజూరు చేసింది.

వేగంగా స్పందించి..

సహజంగా, ప్రమాదవశాత్తు మరణించిన వారి వివరాలను గ్రామాల్లో ఉన్న సిబ్బంది సకాలంలో సేకరించి మండల అధికారులకు పంపుతున్నారు. వీరు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ జరిగిన పది రోజుల్లో బీమా నగదు జమ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మరణ ధ్రువీకరణ పత్రాల విషయంలో జాప్యం జరిగినా నగదు ఇచ్చేలా చూస్తున్నారు.

సకాలంలో బీమా నగదు



వైఎస్సార్ బీమా నగదు సకాలంలో ఆయా బాధిత కుటుంబాల బ్యాంక్ అకౌంట్లలో జమయ్యేలా చర్యలు తీసుకున్నాం. బాధితుల వివరాలు సకాలంలో అప్‌లోడ్ చేసేలా చూస్తున్నాం. బాధిత కుటుంబసభ్యులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం సకాలంలో బీమా నగదు జమ చేస్తోంది.

– మంజుల, డీపీఎం, వైఎస్సార్ బీమా

నగదు జమవుతోంది



ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబసభ్యులకు పదిరోజుల్లో బీమా నగదు జమ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రోజుల వ్యవధిలో మరణించిన 17 మందికి సంబంధించిన నగదును జమ చేయడం జరిగింది. ప్రభుత్వం బీమా నగదును త్వరగా అందజేసి అనేక కుటుంబాలకు అండగా నిలుస్తోంది.

– సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

నడుచుకుంటూ వెళ్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతుడు

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు మైపాడురోడ్డులో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయసు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని నార్త్ ట్రాఫిక్ పోలీసులు కోరారు.

సమర్థవంతంగా పోలీస్ శాఖ విధులు

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- పోలీస్ శాఖకు మూడు బొలెరో వాహనాల అందజేత


వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి, చిత్రంలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): 'జిల్లా పోలీస్ శాఖ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తోంది. ఫలితంగా ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందుతున్నాయి.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. జెమిని ఎడిబుల్ ఆయిల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ (జీఈఎఫ్) సౌజన్యంతో రూ.26 లక్షల విలువ చేసే మూడు బొలెరో వాహనాలను సోమవారం వినాయక చవితి పర్వదినాన నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాలు వద్ద మంత్రి జిల్లా పోలీస్ శాఖకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల ధన, మాన, ప్రాణాల రక్షణలో పోలీసుల పాత్ర అనిర్వచనీయమన్నారు. ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు కృషిచేస్తున్నారని, వారికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. జీఈఎఫ్ సహకారంతో త్వరలో మరో మూడు బొలెరో వాహనాలను అందజేస్తామన్నారు. పోలీస్ శాఖకు పూర్తి సహాయ సహకారాలందిస్తున్న మంత్రికి, జీఈఎఫ్ సిబ్బందికి ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


602 మొబైల్ ఫోన్ల రికవరీ



సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి


నెల్లూరు(క్రైమ్): 'మొబైల్ హంట్ విధానంతో ఫలితాలొస్తున్నాయి. తాజాగా రూ.1.50 కోట్ల విలువచేసే 602 మొబైల్ ఫోన్లను పోలీసు అధికారులు రికవరీ చేశారు.' అని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. నెల్లూరు ఉమేష్ చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో ఎస్పీ చేతుల మీదుగా మంగళవారం బాధితులకు ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి అందించాలన్న సంకల్పంతో మొబైల్ హంట్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. పోలీస్ స్టేషన్లకు వెళ్లకుండా, ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకుండా కేవలం 91543 05600 నంబర్‌కు వాట్సాప్ మెసేజ్ చేస్తే సరిపోతుందన్నారు. చోరీ అయిన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సైబర్ క్రైమ్ టెక్నికల్ విభాగం అతి తక్కువ కాలంలోనే రికవరీ చేస్తుండగా, వాటిని బాధితులకు అందజేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు నాలుగు విడతలుగా జిల్లాలో రూ.3.10 కోట్ల విలువచేసే 1,246 మొబైల్స్‌ను అందించామన్నారు. మిగిలిన వాటిని సైతం త్వరలోనే రికవరీ చేస్తామన్నారు. మొబైల్ హంట్ సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ఎవరైనా తప్పుడు పద్ధతిలో వినియోగిస్తే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. సెల్‌ఫోన్లను తమకు అప్పగించిన ఎస్పీ, సైబర్ క్రైమ్ పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ డి.హిమవతి, ఆర్‌ఐ అంకమరావు, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆర్‌ఎస్‌ఐ సురేష్, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి


రాజేశ్వరమ్మ మృతదేహం

మనుబోలు: విద్యుదాఘాతానికి గురై ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని కాగితాలపూరు క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కంటే నాగేశ్వరరావు – రాజేశ్వరమ్మ (46) దంపతులు క్రాస్‌రోడ్డు వద్ద టిఫిన్ దుకాణం నిర్వహిస్తున్నారు. రాజేశ్వరమ్మ సోమవారం రాత్రి గ్రైండర్‌లో మినపపప్పు వేస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై పడిపోయింది. కుటుంబసభ్యులు గుర్తించి ఆమెను చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు మనుబోలు పోలీసులు మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందడంతో పక్కనున్న దుకాణాలను నిర్వాహకులు భయంతో మూసివేశారు. వారంరోజులుగా సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సాంకేతిక లోపం తలెత్తిందని, దీంతో పలు దుకాణాల్లో షాక్ కొడుతోందని, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నిమ్మ ధరలు (కిలో)
పెద్దవి : రూ.70
సన్నవి : రూ.40
పండ్లు : రూ.10



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు
బ్రాయిలర్ (లైవ్) : 130
లేయర్ (లైవ్) : 113
బ్రాయిలర్ చికెన్ : 226
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 250
లేయర్ చికెన్ : 192